యువ వెలుగు
PRGI: TGTEL/26/A6429
E- Paper, www.yuvavelugu.com
తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 41 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | బుధవారం 14-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-



యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను
మండలం । నియోజకవర్గం । జిల్లా
వారీగా రిపోర్టర్లు కావలెను
9908 502 602


## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా గంజాయి పట్టివేత

- గీజర్‌లో దాచి తరలిస్తున్న 7.750 కిలోల గంజాయి సీజ్
- పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 2.71 కోట్లు అని అంచనా
- బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడిని అరెస్ట్ చేసిన డీఆర్ఐ

హైదరాబాద్, యువ వెలుగు సెప్టెంబర్ 13 : హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ...(మిగతా 2లో)




## హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు

### 12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు!

- 2027 క్రికెట్ ప్రపంచకప్ టికెట్లకు భారీ డిమాండ్
- 12 రోజుల్లోనే కోటిన్నరకు పైగా దరఖాస్తులు
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యం
- 24 ఏళ్ల తర్వాత ఆఫ్రికాలో జరగనున్న మెగా టోర్నీ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించేందుకు ఐసీసీ సన్నాహాలు

2

## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

2లో



# ఎన్‌నినో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతాయన్నది వదంతే

### అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచన




హైదరాబాద్, యువ వెలుగు సెప్టెంబర్ 13 : హైదరాబాద్ నగరంలో నీటి సరఫరాపై వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తమ పేరుతో ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని హైదరాబాద్ జలమండలి (హెచ్‌ఎండబ్ల్యూ ఎస్‌ఎస్‌బీ) స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ఎన్‌నినో ప్రభావం, కరవు పరిస్థితుల కారణంగా నవంబర్ చివరి నాటికి హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే జలాశయాలు ఎండిపోతాయని, దీంతో నగరంలో నీటి సరఫరాను నిలిపివేస్తారని లేదా తీవ్ర ఆంక్షలు విధిస్తారని ఒక మెసేజ్ కొద్ది రోజులుగా వైరల్ అవుతోంది. ఈ సందేశం జలమండలి జారీ చేసినట్టుగా ఉండటంతో నగరవాసుల్లో ఆందోళన ...(మిగతా 2లో)

## సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్

- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 13 : దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు.



## సెన్సెక్స్ 1,109 పాయింట్లు జంప్

### ఇన్వెస్టర్లకు రూ.4.5 లక్షల కోట్ల లాభం

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 1,109 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ 22,700 పాయింట్ల మార్కును దాటింది. ఐటీ షేర్లలో కొనుగోళ్ల జోరు, తక్కువ ధరలకు లభిస్తున్న షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం మార్కెట్లకు ఊతమిచ్చాయి. ఈక్విటీలపై విధిస్తున్న దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ), సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)పై సమీక్ష జరిగే అవకాశం ఉందన్న అంచనాలు కూడా సెంటిమెంట్‌ను పెంచాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,109.10 పాయింట్లు (1.54 శాతం) పెరిగి 73,033.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 358.60 పాయింట్లు (1.60 శాతం) లాభపడి 22,721.95 వద్ద ముగిసింది. ఇటీవల మార్కెట్లలో చోటుచేసుకున్న ఒడుదొడుకుల తర్వాత ఈ ర్యాలీ ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. ముఖ్యంగా ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ దాదాపు రూ.4.5 లక్షల కోట్లు పెరగడం విశేషం.

నిఫ్టీ-30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, శ్రీరామ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, మారుతీ, మ్యాక్స్ హెల్త్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

**మార్కెట్ పెరుగుదలకు ప్రధాన కారణాలు**

ఐటీ షేర్లలో జోరు: నిఫ్టీ ...(మిగతా 2లో)

## ఏపీకి వర్ష సూచన

### రానున్న మూడు రోజులు వానలు

- బంగాళాఖాతంలో ద్రోణి.. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- బంగాళాఖాతంలో ద్రోణి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం
- బుధవారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశం
- పిడుగులు పడతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన



అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 13 : ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య తరువాయి 2లో..

## మైల్ పబ్లికేషన్స్ నుంచి రెండు పత్రికలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణారావు



హైదరాబాద్, యువ వెలుగు సెప్టెంబర్ 13 : మైల్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న ది విజనరీ న్యూస్, జాతీయ వార్తా ప్రపంచం పత్రికలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అధికారికంగా ఆవిష్కరించారు. అంతకుముందు మైల్ పబ్లికేషన్స్ బృందం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సమస్యలు, నియోజకవర్గ ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో మైల్ పబ్లికేషన్స్ ఎడిటర్-ఇన్-చీఫ్ శివకుమార్ రెడ్డి, మేనేజింగ్ ఎడిటర్ మధురుధన్ రెడ్డితో పాటు బాలాజీ, శంకర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, రామరాజు, మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం రెండు పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణారావు, మైల్ పబ్లికేషన్స్ బృందాన్ని అభినందించారు. పత్రికలు విజయవంతంగా ముందుకు సాగాలని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్

### పదవీకాలం పెంచిన ఏపీ ప్రభుత్వం



- వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కాలపరిమితి పొడిగింపు
- మరో రెండు నెలల పాటు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- సంక్షేమ, అభివృద్ధి పనుల కొనసాగింపు కోసమే ఈ నిర్ణయం అన్న ప్రభుత్వం

అమరావతి, యువ వెలుగు సెప్టెంబర్ 13 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల పదవీకాలాన్ని మరో రెండు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు తమ విధుల్లో కొనసాగనున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనుల అమలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వాటిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న నేతల పనితీరు, శాఖల మధ్య సమన్వయం ఆధారంగా ఈ పొడిగింపు తరువాయి 2లో..

## చంద్రబాబుతో భేటీ అయిన తమిళనాడు సీఎం విజయ్

- సీఎం హోదాలో ఏపీకి తొలిసారి వచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
- తెలుగు గంగ, గోదావరి-కావేరి అనుసంధానంపై ఏపీ, తమిళనాడు సీఎంల చర్చలు
- భేటీకి ముందు కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్



అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 13 : ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య కీలకమైన అంతర్రాష్ట్ర జల పంపకాలపై చర్చించేందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ అధికారికంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో చెన్నై నగరానికి తాగునీరు అందించే తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల విడుదల, ప్రతిపాదిత గోదావరి-కృష్ణ-కావేరి నదుల అనుసంధానం వంటి అంశాలపై ఇరువురు నేతలు ప్రధానంగా దృష్టి సారించనున్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది తమిళనాడుకు కేటాయించిన నీటిలో చాలా తక్కువ వాటా మాత్రమే అందడంతో, నీటి విడుదలపై చర్చించేందుకు ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో ఏపీ తరఫున మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామా ...(మిగతా 2లో)

## జీవో 134 ఒక కుట్ర.. కక్ష సాధింపే : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- జీవో 134 రాజ్యాంగ విరుద్ధమన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇది కేవలం బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా తెచ్చిన జీవో అని ఆరోపణ
- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి భూములపైనా విచారణ జరపాలని డిమాండ్



హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 13 : తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ...(మిగతా 2లో)

## కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్లు గురించి మాట్లాడుతున్నారు: సబితా ఇంద్రారెడ్డి



- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం

2లో

# ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ

### కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు!

- ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు కేంద్రం, ఎన్నికల సంఘం
- సమాధానాలు ఇవ్వాలని ఆదేశం తదుపరి విచారణ నవంబర్ 2న జరిగే అవకాశం
- 2023 చట్టంలోని సెక్షన్ 16ను సవాల్ చేసిన ఏడీఆర్
- రక్షణ వల్ల జవాబుదారీతనం తగ్గుతుందని ఏడీఆర్ వాదన



న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 13 : ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ

తరువాయి 2లో..

# కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్లు గురించి మాట్లాడుతున్నారు: సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 13** :తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి




**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 13 :** దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతి భద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణ దారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

# అన్నపూర్ణ దేవిగా ఏడుపాయల దుర్గామాత



**పాపన్నపేట, యువ వెలుగు, సెప్టెంబర్ 13:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడుపాయల వన దుర్గ భవాని మాత మూడవ రోజు అయిన మంగళవారం శ్రీ అన్నపూర్ణ దేవి (చంద్రఘంటా)రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని నీలం రంగు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మూలవిరాట్ దుర్గామాత తో పాటు, నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న గోకుల్ షెడ్ లో ఉన్న ఉత్సవ విగ్రహాన్ని సైతం నీలం రంగు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా గోకుల్ షెడ్ లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో వీరేశం తో పాటు ఆలయ సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాటు చేశారు..

# హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు

## 12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు!

**హైదరాబాద్ :** 2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటాయి. టోర్నీ ఆరంభానికి ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టికెట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు రావడం క్రికెట్ అభిమానుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 142 దేశాల నుంచి అభిమానులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు రాగా, 44,23,417 బ్యాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన మొదటి వారంలోనే 10 లక్షల దరఖాస్తులు రాగా, ఆ తర్వాత అనూహ్యంగా ఈ సంఖ్య పెరిగింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీ ఆఫ్రికా గడ్డపై జరగనుండటం విశేషం. అంతేకాకుండా, నూతన ఫార్మాట్‌లో జరగనున్న ఈ 14వ ఎడిషన్‌ను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ అనూహ్య స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా మాట్లాడారు. "ప్రపంచకప్ టోర్నీకి ఉన్న ప్రతిష్ఠ, ఆతిథ్య దేశాలుగా ఆఫ్రికా దేశాలకు ఉన్న ఆకర్షణ, టోర్నీకి ముందు ఐసీసీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలే ఈ భారీ స్పందనకు కారణం. ఇది మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని వివరించారు.

టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉన్నందున, రానున్న రోజుల్లో 360 డిగ్రీల యాక్టివేషన్లు, వివిధ వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతామని ఆయన తెలిపారు. అభిమానులు టికెట్ల బ్యాలెట్ కోసం రిజిస్టర్ చేసుకునేందుకు 2026 నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 2027 నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ 2027 అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో మూడు జట్ల సూపర్ సిరీస్‌తో ప్రారంభం కానుంది. మొత్తం మీద టోర్నీ ఆరంభానికి ముందే టికెట్లకు ఈ స్థాయిలో డిమాండ్ రావడం, ఈ మెగా ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ**

**ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం**

**కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్**

**హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన**

**హైదారాబాద్ :** తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

# సెన్సెక్స్ 1,109 పాయింట్లు జంప్

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ సూచీ 5.22 శాతం పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు 8.28 శాతం ఎగబాకింది. టీసీఎస్ 6.59 శాతం, టెక్ మహీంద్రా 4.90 శాతం, ఇన్ఫోసిస్ 4.44 శాతం లాభపడ్డాయి. మెరుగైన త్రైమాసిక ఫలితాలు ఐటీ షేర్లపై ఆసక్తిని పెంచాయి.

పన్నులపై సమీక్ష అంచనాలు: వచ్చే కేంద్ర బడ్జెట్ సన్నాహాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎల్‌టీసీజీ పన్ను, ఎస్‌టీటీపై ఇన్వెస్టర్ల అభిప్రాయాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీంతో ఈ పన్నులపై సమీక్ష జరిగే అవకాశం ఉందన్న ఆశలు పెరిగాయి. అయితే పన్నులను రద్దు చేస్తామని ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదు.

తక్కువ ధరలకు కొనుగోళ్లు: ఇటీవలి మార్కెట్ పతనం తర్వాత కొన్ని షేర్లు ఆకర్షణీయమైన ధరలకు లభిస్తుండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఐటీతో పాటు ఆర్థిక సేవలు, రియల్టీ, కన్జ్యూమర్ రంగాల షేర్లలోనూ లాభాల స్వీకరణకు బదులుగా కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

**చాలా రంగాల్లో లాభాలు**

ఐటీతో పాటు చాలా రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ రియల్టీ 2.46 శాతం, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.56 శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 25/50 సూచీ 1.54 శాతం పెరిగాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. ఫార్మా సూచీ మాత్రం స్వల్పంగా 0.01 శాతం తగ్గింది.

**ఇంకా అప్రమత్తత అవసరం**

మార్కెట్లు భారీగా పెరిగినప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు, ముడి చమురు ధరల్లో ఒడుదొడుకులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. సెప్టెంబర్ త్రైమాసిక కంపెనీల ఫలితాలు, రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధానం కూడా మార్కెట్ల తదుపరి కదలికలకు కీలకం కానున్నాయి.

# ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది.

**అసలు వివాదం ఏంటి?**

2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించ కూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

**ఏడీఆర్ అభ్యంతరాలేంటి?**

సెక్షన్ 16 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కు, ఆర్టికల్ 19లోని స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఏడీఆర్ వాదిస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంత విస్తృత రక్షణ కల్పించడం వల్ల వారి చర్యలపై జవాబుదారీతనం తగ్గుతుందని పిటిషన్‌లో పేర్కొంది. అధికార దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన పరిశీలనకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది.

**ఎన్నికల సంఘం అధికారాలపైనా మరో పిటిషన్**

ఎన్నికల సంఘం పనితీరు, దాని అధికారాల వినియోగంపై కూడా సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు విచారణకు వస్తున్నాయి. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘానికి చెందిన అధికారాలను వ్యక్తిగతంగా వినియోగించగలరా లేదా ఆ సంస్థ తరఫున ఏకపక్షంగా వ్యవహరించగలరా అనే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా అక్టోబర్ 5న ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణాధికారాలు ఎన్నికల సంఘం అనే సంస్థకు ఉంటాయని పిటిషనర్ వాదించారు. ఈ అధికారాలను సీఈసీ ఒక్కరే వినియోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపైనా సుప్రీంకోర్టు స్పందన కోరింది.

**సీఈసీ నియామక చట్టంపైనా భేదాభిప్రాయం**

2023 చట్టంలో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. సెప్టెంబర్ 23న ఈ అంశంపై విచారణ జరిపిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడగా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఇందులో రాజ్యాంగపరమైన కీలక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొని విస్తృత ధర్మాసనానికి పంపాలని సూచించారు. దీంతో ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలించేందుకు కేసు పత్రాలను సీజేఐ సూర్యకాంత్ ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఆదేశించారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న 2023 చట్టం ప్రకారం, నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రివర్గ సభ్యుడు ఉంటారు. అంతకుముందు, 2023 మార్చిలో అనూప్ బరణ్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఏర్పాటులో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలని పేర్కొంది. ఎన్నికల కమిషనర్లకు కల్పించిన న్యాయపరమైన రక్షణ, వారి అధికారాల వినియోగం, నియామక విధానం వంటి అంశాలు ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. ఈ పిటిషన్లపై వెలువడే తీర్పులు ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనానికి సంబంధించిన చర్చలో కీలకంగా మారనున్నాయి.

# నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

వర్తిస్తుందని తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ పొడిగింపు కాలంలో ప్రజాసేవలో మరింత చురుగ్గా పనిచేస్తామని వారు తెలిపారు. ఈ పొడిగింపుతో అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

# చంద్రబాబుతో భేటీ అయిన తమిళనాడు సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

నాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు తమిళనాడు సీఎం విజయ్‌కు పరిచయం చేశారు. అంతకుముందు, గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్, నేరుగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాత్రికి జరగనున్న విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకల్లో పాల్గొని, అనంతరం ఆయన చెన్నైకి తిరిగి వెళ్లనున్నారు.

# జీవో 134 ఒక కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు. సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారని, చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని వాపోయారు.

భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఎన్‌నినో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతాయన్నది వదంతే

(మొదటి పేజీ తరువాయి)

మొదలైంది. ఈ ప్రచారంపై స్పందించిన జలమండలి అధికారులు, తాము అలాంటి హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదని స్పష్టం చేశారు. వైరల్ మెసేజ్‌లో పేర్కొన్న జలాశయాల నీటిమట్టాలు, సరఫరా పరిస్థితులకు సంబంధించిన సమాచారం అధికారికం కాదని తెలిపారు. తమ సంస్థ పేరుతో వచ్చే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీటి సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమాచారం కోసమైనా బోర్డు అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

# ఏపీకి వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, బుధవారం (అక్టోబర్ 14) పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున వర్షం సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల కింద నిలబడవద్దని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ. 2.71 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

పక్కా సమాచారం అందుకున్న డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని అడ్డగించారు. అతని చెక్-ఇన్ బ్యాగేజీని తనిఖీ చేయగా, అందులో ఒక ఎలక్ట్రిక్ గీజర్ కనిపించింది. అనుమానంతో దాన్ని తెరిచి చూడగా, లోపల 73 ప్యాకెట్లలో పచ్చని పదార్థం బయటపడింది.

నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయి అని నిర్ధారణ అయింది. దీంతో అధికారులు వెంటనే సదరు ప్రయాణికుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్, 1985 ప్రకారం అరెస్ట్ చేశారు. సరుకును మొత్తం సీజ్ చేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్‌కు అధిక నాణ్యత గల గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టే ప్రయత్నాల్లో భాగంగా ఈ పట్టివేత జరిగిందని అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్నందున నిందితుడి వివరాలను ఇంకా వెల్లడించలేదు.



# దేవి నవరాత్రుల విశిష్టతను తెలుసుకుందా




**దోమకొండ , యువ వెలుగు, అక్టోబర్ 13 :** అమ్మవారు జ్ఞానదాయిని, మోక్షదాయిని, సర్వ విద్యాప్రదాయిని. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు ఉండే పది తిథుల లోనూ నిష్ఠగా ఉండి ఇంద్రియాలను జయించాలని, దాని వల్ల పునర్జన్మ ఉండదని దేవ్యుపనిషత్తు తెలుపుతోంది. అమ్మ అంటే ప్రకృతి. ఈ ప్రకృతిని ప్రేమించడం, దానిని వికృతిని చేయక రక్షించడమే అమ్మ పూజ అని, అదే మానవ ధర్మమనీ బ్రహ్మాండ పురాణం చెబుతోంది. ఈర్ష్యను వదలడం, సత్యం, అహింస, ధర్మం, దురాశను వదలడం, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం, దురాచారాలు, పాపాలు త్యజించి, పరస్త్రీని, పరధనాన్నీ కోరకుండా ఉండటం, ఆత్మ స్థైర్యంతో సర్వ కార్యాల నూ సాధించడం ఇవే శరన్నవ రాత్రుల పూజలలోని విశేషార్థం. అమ్మ వారికి వసంతకాలంలో వచ్చే చైత్ర శుక్ల పాడ్యమి మొదలుగా గల నవ రాత్రులన్నా, శరత్కాలంలో వచ్చే ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుగా గల నవరాత్రులన్నా ఇష్టమైన రోజులు. ఈ ఋతువులు రెండూ రోగాలు వ్యాపింపజేసే లక్షణాలున్నవే. వర్షాలు వెనకబడటం వల్ల శరత్కాలంలోనూ, చలితొలగడం వల్ల చైత్రంలోనూ కొత్త రోగాలు వచ్చి ప్రజలను పీడించి ప్రాణాలు తీస్తాయనీ, అందువల్ల. వీటిని యముని కోరలుగా పిలుస్తారనీ, ఈ బాధల నుండి బయటపడటానికి అమ్మను పూజించాలని వేదవ్యాసుడు జనమేజయ మహారాజుకు చెప్పాడు. కేవలం మహిషాసుర సంహారం వల్ల శరన్నవరాత్రుల పూజలు ఆరంభ మయ్యాయని చాలా మంది భావిస్తారు. కానీ అది తప్పు. శరన్నవ రాత్రులు ఆరంభం కావడానికి మూలకారకుడు కృతయుగంలోని దుర్గ ముడు. హిరణ్యాక్షుని కొడుకు రురుడు. వాడి కొడుకు దుర్గముడు. వాడు బ్రహ్మ గురించి తపస్సు చేసి, విప్రులు వేదాలు మరచిపోవాలనీ, అవి తనకే చెందాలనీ వరం కోరాడు. ఆ వరం వాడికి బ్రహ్మ ఇవ్వడంతో విప్ర,మునులంతా వేదాలు మరచిపోయారు. దాని వల్ల యజ్ఞాలు ఆగిపోయాయి. హవిస్సులు అందక దేవతలు కృశించి పోయారు. దేవతలుకృశించడంతో వర్షాలు కురవక భూలోక వాసులు తల్లడిల్లి పోయారు. అప్పుడు వారంతా అమ్మను ప్రార్థించగా శ్రీదేవి వారి అందరికి ముందుగా ఆహారాన్ని పెట్టింది. అప్పటి నుంచి అమ్మవారిని శాకంభరి అన్నారు. ఆపై దుర్గ ముడిని చంపివేసింది. వాడి చావుతో బ్రహ్మ వాడికి చ్చిన వరం తొలగిపోయి యథాస్థితి ఏర్పడింది. లోకం సుభిక్ష మైంది. దుర్గముడిని చంపడం వల్ల అమ్మవారికి దుర్గ అని పేరు వచ్చింది. శ్రీమత్ దేవీ భాగవ తంలోని సప్తమ స్కంధంలో ఈ కథ ఉంది.దుర్గా సప్తశతిలో కూడా అమ్మ స్వయంగా, దుర్గముడిని చంపిన తనకు దుర్గ అనే పేరు వచ్చిం దని చెప్పింది.ఆశ్వయుజ శుక్ల అష్టమి నాడు అమ్మవారు దుర్గ ముడిని చంపడం వల్ల ఆనాటి నుండి దుర్గాష్టమిగా దానిని పేర్కొన్నారు. శరన్నవరాత్రులు ఉత్తమ మనువు కాలంలో ఈ దుర్గమ వధ వల్ల ప్రారంభమైనట్లు కాళికా పురాణం చెప్తోం ది. పూర్వం శ్రీరాముడు సీతా న్వేషణ సమయంలో లంకకు వెళ్లే ముందు నారదుని సలహాపై అంబికను ప్రతిష్ఠించుకుని దేవీ నవరాత్రి పూజలు చేశాడు. అష్టమినాడు అమ్మవారిని 1008 తామరపూలతో, అవి కూడా వేయి రేకులున్న వాటితో పూజించదలిచాడు. సహస్రార కమలాలు కేవలం సౌగంధి కసరస్సు లోనే ఉంటాయి. వాటిని హనుమంతుడు రాముడికి తెచ్చి ఇచ్చాడు. నారదుని పౌరోహిత్యంలో అష్టమీ పూజ శ్రీలలితా సహస్రనామాలతో జరుగుతోంది. ఇంకా రెండు నామాలున్నాయనగా రెండు పూలు తక్కువ య్యాయి. నారదుడు దీక్షలో నుండి కదలకూడదనీ, ఆలస్యం లేకుండా ఆ రెండు పూలూ కూడా సమర్పించక పోతే పూజ అంతావ్యర్థ మేననీ, పైగాఅమ్మ వారికి మహాపచారం కూడా చేసినట్లేననీ అన్నాడు. అప్పుడు రాముడు నాకళ్లే. తామరపూలకు బదులుగా ఇస్తాననీ, నన్ను ప్రజలు 'రామః కమల పత్రాక్షః' అంటారనీ పలికి, ఆ రెండు నామాలనూ నారదుడు చదువుతుండగా, తన కళ్లు పీకి అమ్మకు సమర్పించాడు. అప్పుడు అమ్మ అష్టమి నాటి ఆ రాత్రి వేళ ఆయనకు ప్రత్యక్షమై, తానే రాముడిని పరీక్షించడానికి పూలు మాయం చేశానని చెప్పి, రాముని అనన్య భక్తికి వరాలిచ్చి, దశమినాడు లంకకు వెళ్ళమని ఆయనకు సీతా సమాగమం అవుతుందని వరమిచ్చింది. అప్పటి నుంచి దుర్గాష్టమి రామాష్టమిగా, విజయాష్టమిగా, మోక్షాష్టమిగా ప్రసిద్ధికెక్కిందని కాళికా పురాణం, శ్రీమత్ దేవీ భాగవతంలోని తృతీయ స్కంధంలోనూ వ్యాసుడు వివరించాడు. నవరాత్రులు తొమ్మిది రోజులూ అమ్మవారిని పూజించలేని వారు కనీసం అష్టమి నుండి అయినా అమ్మను అర్చించడం ఫలదాయకం. అర్చన విధానం అమ్మ వారిని ఉంచే మండపాన్ని తోరణాలతో అలంకరించాలి. ఉదయమే లేచి పవిత్ర స్నానం చేయాలి. అమ్మ వారిని వస్త్రాదులతో అలంకరించాలి. అమ్మవారి పాదాల వద్ద నవార్ణవ మంత్రంతో కూడిన యంత్రం స్థాపించాలి. వేదికపై కుడివైపు అంటే మనకు ఎడమవైపు కలశస్థాపన చేయాలి. కలశంలో పంచ పల్లవాలు అంటే రావి, జువ్వి, మేడి, మద్ది, మామిడిచిగుళ్లు ఉంచాలి. కలశంలో నదీ జలం, సువర్ణం, రత్నం వీలును బట్టి వేయాలి. ముందుగా ఆచమనం చేయాలి. సంకల్పం పుచ్చుకొని పూజను ఆరంభించాలి. గురూపదేశ మంత్రం జపించి, సహస్ర నామాలతో శ్రీచక్రాన్ని పూజించాలి. నిత్యార్చనలో పంచామృతాలు ఉపయోగించాలి. అమ్మవారి పూజలో గంధం, అగరువత్తులు, కర్పూరం, సుగంధ పుష్పాలు, అమ్మ వారి పూజకు మందారం, కానుగ, అశోకం, సంపెంగ, గన్నేరు, మాలతి, బిల్వపత్రాలు, తామ రపూలు, కలువ పూలు ఉండాలి. నల్లకలు వలు శ్రేష్ఠం. నైవేద్యంలో ఉండవలసిన ఫలాలు కొబ్బరికాయ, నిమ్మ, దానిమ్మ, అరటి, నారింజ, పనస, మారేడు కాయ. పిండి వంటలు దద్ధ్యోదనం, పాయసం అమ్మవారి పూజాదులలో అనేక అంతరార్థా లున్నా యి. 'దురాచార విఘాతి నీం' అని అమ్మను శ్రీ దేవ్య ధర్వ శీర్షం వర్ణించింది. మనలోని అహంకార మమకారాలు, కోమ క్రోధాదులు, జంతువులను బలి ఇచ్చే హింసాది లక్షణాలకు 'దుం' అని పేరు. వాటిని తొలగించే తల్లి దుర్గ అని, దురాచారా లను తొలగించు కోవడమే శరన్నవరాత్రుల పూజలోని అంతరార్థమనీ, మనలోని నవరంధ్రాలను శుద్ధి చేసుకోవడమే నవరాత్ర పూజ అనీ, అథర్వ శీర్షంలోని మంత్రాలు వివరిస్తున్నాయి.

## ప్రజావాణికి రెండు వినతులు

### సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి




**చేవెళ్ల, యువ వెలుగు, అక్టోబర్ 13 :** ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం రెండు వినతులు అందాయి. చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు దరఖాస్తులు వచ్చాయి.వినతులను సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. దరఖాస్తుదారులకు తీసుకున్న చర్యలపై లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని సూచించారు. గతంలో అందిన వినతుల పరిష్కార పురోగతిపైనా సమీక్ష నిర్వహించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలి - జిల్లా కలెక్టర్



**నల్లగొండ, యువ వెలుగు, అక్టోబర్ 13 :** ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, రానున్న 300 రోజులు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.సోమవారం పగిడిమర్రి గ్రామంలో రైతు వేదిక సెంటర్లో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. నాగార్జున సాగర్‌లో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో చెరువులు, కాలువలు, బోరుబావుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని ,ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటూ, ఎంత అవసరమో అంత మాత్రమే వినియోగించుకోవాలని భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పెసర్లు,మినుములు,కందులు, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. రైతులు పరస్పరం చర్చించుకుని ప్రత్యామ్నాయ పంటలపై తమ అభిప్రాయాలను తెలియజేస్తే, వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. పండ్లు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారించాలన్నారు.జూన్, జూలై నెలల వరకు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, అందరూ సమష్టిగా పనిచేసి నీటి ఎద్దడిని అధిగమించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా హార్టికల్చర్ అధికారి శేఖర్, ట్రాన్స్కో ఎస్‌ఈ ,తహసిల్దార్ పద్మ ఎంపీడీవో వేద రక్షిత సర్పంచ్ నాగవెల్లి నాగమణి సైదులు, ఏఈఓ కీర్తన, జగల్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పదేళ్ల పండుగ... పది తరాలకు గుర్తుండేలా..

**పదేళ్ల పండుగలో భాగస్వామ్యమై జిల్లా స్ఫూర్తిని చాటారు**

**పదేళ్ల పండుగ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**




**సిద్దిపేట జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 13 :** సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ పది తరాలకు గుర్తు ఉండేలా జరిగిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ముగింపు సభ అద్భుతంగా జరిగిందని, సభకు తరలివచ్చిన ప్రజానీకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హరీష్ రావు కృతజ్ఞతలు తెలియజేశారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటు జరిగి పదేళ్లు అయిన సందర్భంగా జిల్లా పండుగ చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పటి నుండి ముగింపు సభ అయ్యేంత వరకు ఎన్నో కార్యక్రమాలు ఎంతో మంది వివిధ రూపాల్లో చేశారని, ఎవరికీ వారు స్వచ్ఛందంగా నిర్వహించారని చెప్పారు. సన్నాహక సమావేశంలో ఎంతో మంది తమ సలహాలు, సూచనలు ఇచ్చారని వారి అభిప్రాయాలు స్వీకరించి మూడు రోజుల కార్యక్రమం ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయిన కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, లాయర్లు, ప్రజాసంఘాలు, వ్యాపారులు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు తదితర సంఘాల ప్రతినిధులకు హరీష్ రావు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల పండుగను గత వారం రోజుల నుండి పత్రిక ప్రకటనలు, ప్రత్యేక కథనాలు ప్రచురించి యూట్యూబ్ ఛానల్స్ ద్వారా సిద్దిపేట ఖ్యాతి ని ప్రపంచం స్థాయిలో తెలియజేశారని, అదేవిదంగా సోషల్ మీడియా లో ఎవరికీ వారు స్వచ్ఛందంగ సిద్దిపేట జిల్లా పండుగ స్ఫూర్తి ని చాటి చెప్పారని ఈ సందర్భంగా వారికి నా హృదయపూర్వక ధన్యవాదములని చెప్పారు. ఈ స్ఫూర్తి సిద్దిపేట జిల్లా అభివృద్ధిలో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఎల్‌నినోతో వర్షాభావం పొంచి ఉంది!

**- తక్కువ నీటితో పండే పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి**

**- రైతు నేస్తం కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**చేవెళ్ల, యువ వెలుగు అక్టోబర్ 13 :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవ కాశాలున్నందున రైతులు ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు.ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, చెరకు, పసుపు వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, జొన్న, కుసుమ, శనగ, ఇతర పప్పు ధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వా లని ప్రధాన కార్యదర్శి సూచిం చారు. వాతావరణానికి అనుగుణంగా పంటలను ఎంచుకోవడం ద్వారా నీటి కొరతతో కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఆలూరు వెటర్నరీ అసిస్టెంట్ ప్రశాంత్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ ప్రజాప్రతి నిధులు, రైతులు పాల్గొన్నారు.

## రైతుతో తహసీల్దార్ వెకిలి వ్యాఖ్యలా!

**'నువ్వింకా బతికే ఉన్నావా.. పురుగుల మందు తాగలేదా?' అంటూ వ్యాఖ్యలు చేసినట్లు వైరల్ అవుతున్న వీడియో**

**అధికారులకు ఇది తగదు.. రైతులను గౌరవించాలి : సూర్యప్రసాద్ రాజు**



**చేవెళ్ల, యువ వెలుగు, అక్టోబర్ 13 :** రైతులను ఆదుకోవాల్సిన అధికారులే వారిని కించపరిచేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఎస్వీఆర్ చేయూత ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ సూర్యప్రసాద్ రాజు ప్రశ్నించారు. ఓ రైతును ఉద్దేశించి తహసీల్దార్ నువ్వింకా బతికే ఉన్నావా.. పురుగుల మందు తాగలేదా అంటూ వ్యాఖ్యానించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు అధికారుల హోదాకు తగవని పేర్కొన్నారు.రైతులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పంటలు పండించి సమాజానికి అన్నం పెడుతున్నారని సూర్యప్రసాద్ రాజు అన్నారు. భూ సమస్యలు, ఇతర రెవెన్యూ వ్యవహారాల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే రైతులతో అధికారులు గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలను ఓపికగా విని, నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతుల మనోభావాలను దెబ్బతీసేలా, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం సరి కాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధి కారులు స్పందించి, వైరల్ అవుతున్న వీడియోలోని వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రైతులకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించాలి

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**సూర్యాపేట జిల్లా /అనంతగిరి/యువ వెలుగు, అక్టోబర్ 13 :** ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కి నిరసన తెలిపే ఏకైక ఆయుధం ఓటు హక్కు మాత్రమేనని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. రానున్న వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులా ఉండాలని వ్యాఖ్యానించారు. అనంతగిరి మండలం చనుపల్లి గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సదస్సులో పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలి.నమోదు ప్రక్రియపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కల్పిస్తూ, గ్రాడ్యుయేట్లకు ఉండే సందేహాలను నివృత్తి చేయాలి. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని పట్టభద్రుల సమస్యలు, ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యంపై చైతన్యం తీసుకురావాలి. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 265 మందికి ఉచిత శిక్షణ



**జహీరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 13 :** ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు జహీరాబాద్‌లోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో 45 రోజుల ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న 588 మందికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించగా, 265 మంది అర్హత సాధించారు. ఎంపికైన అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సైదా నాయక్, ఆర్డీవో దేవుజా, ఆర్ఎల్ఆర్ పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.లక్ష్మారెడ్డి, టౌన్ సీఐ రవి, గ్రామీణ సీఐ నరసింహ, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

యువ వెలుగు
PRGI: TGTEL/26/A6429
E-Paper, www.yuvavelugu.com తెలుగు దిన పత్రిక
హైదరాబాద్, బుధవారం 14-10-2026

# బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నారాయణరెడ్డి

## 15న రంగారెడ్డి జిల్లా ఐడీఓసీలో జిల్లా స్థాయి బతుకమ్మ సంబరాలు



**రంగారెడ్డి, యువ వెలుగు, అక్టోబర్ 13 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రేవతి మాట్లాడుతూ.. ఈ నెల 14న హైదరాబాద్ నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు, 15న రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి, కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శాంతిశ్రీతో పాటు సైదమ్మ, బాలేశ్వరి, రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య, స్వాతి, పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను, పుల్లమ్మ, ప్రశాంతి, మమత, శ్రీలత, భవాని తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంతో వచ్చే కరువును దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి : డిఆర్‌డిఏ అధికారి భాస్కర్







**లింగాలగనపురం, యువ వెలుగు, అక్టోబర్ 13 :** లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల గ్రామంలో వీబీ-జీ రామ్ జీ పనులను పరిశీలించిన DRDA అధికారి భాస్కర్, రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో వచ్చే కరువును దృష్టిలో ఉంచుకుని రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులు ముందుచూపుతో వరి పంటను పక్కనపెట్టి, తక్కువ నీటితో పండే కూరగాయలు మరియు పప్పు ధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. దీనివల్ల కరువు పరిస్థితులను ఎదుర్కోవడమే కాకుండా, ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింగ రామకృష్ణ, MPDO శివశంకర్, EC సతీష్, TA కనకయ్య, ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వార్డ్ మెంబర్స్ బొజ్జం సునీత ప్రభాకర్, నాయకులు జెగ్గం అశోక్, యేనగందుల భాస్కర్, కారాబర్ చెరుకు అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల శ్రీనివాస్ మరియు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో 16L కాలువ ద్వారా చౌట కుంటను గోదావరి నీళ్లతో నింపే కార్యక్రమం



**లింగాలగనపురం, యువ వెలుగు, అక్టోబర్ 13 :** లింగాలగనపురం మండలం నెల్లుట్ల గ్రామంలో వరి పంటలు ఎండిపోకుండా మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో 16L కాలువ ద్వారా చౌట కుంటను గోదావరి నీళ్లతో నింపే కార్యక్రమాన్ని సర్పంచ్ నర్సింగ రామకృష్ణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటేల్ గూడెం సర్పంచ్ పొన్నాల బుచ్చిరెడ్డి, నెల్లుట్ల ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వార్డ్ సభ్యులు బొజ్జం సునీత ప్రభాకర్, తాండ్ర భరత్, గోతుకుల రవి, మరియు స్థానిక నాయకులు చిట్ల తిరుమల రెడ్డి, పెంతల సోమయ్య, బోయిని వెంకటేష్, ఎడ్ల నగేష్ లతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు



**నిర్మల్, యువ వెలుగు, అక్టోబర్ 13 :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 189 మంది వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాలలో చేరడం వల్ల చేకూరే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలపై ఈ సందర్భంగా వారికి సమగ్రమైన అవగాహన కల్పించారు. వయోవృద్ధులలో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, సంఘాల ద్వారా పరస్పర సహకార ప్రాముఖ్యతను వివరించారు. వారి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లభించే రకరకాల ప్రయోజనాలను ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు.

వయోవృద్ధులతో బతుకమ్మలను స్వయంగా తయారు చేయించి, వారితో బతుకమ్మ ఆటపాటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన కాంగ్రెస్ శ్రేణులు

**జనగామ జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 13 :** దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్ నుంచి పాలకుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ ని మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఎస్సైని కలిసిన వారు మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, వార్డు సభ్యుడు తోటకూరి రమేష్, మండల నాయకులు రెడ్డిరాజుల రమేష్, అశోక్, మహేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# చిట్యాలలో ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

**- నినాదాలతో మారు మ్రోగిన చౌరస్తా ప్రాంతం**

**- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**



**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 13 :** తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో మధుసూదనా చారి జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలోని చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనా చారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ ముదిరాజ్, మండల యూత్ కమిటీ మాజీ అధ్యక్షుడు జన్నె యుగంధర్ లు మాట్లాడుతూ... భూపాలపల్లి జిల్లా ఏర్పాటు కేవలం సిరికొండ మధుసూదనాచారితో మాత్రమే సాధ్యమైంది అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రానికి చేస్తూ ఎనిమిది కిలోమీటర్ల పాటు సెంటర్ లైటింగ్ సిస్టమును ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని వారు తెలిపారు. చిట్యాలలో 50 పడకల ఆసుపత్రి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఆయన కృషి మూలంగానే వచ్చాయని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పూర్తిచేసి అద్భుతమైన అభివృద్ధిని సాధించారని కొనియాడారు. కొన్ని కారణాల మూలంగా ఓటమిపాలైన భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం నేటికీ ఆయన కృషి చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కన్నెబోయిన అశోక్, కొత్త శ్రీను, జెంబుల చంద్రమౌళి, సంగ రాజేందర్, ఎండి శంషుద్దీన్, ఎజ్జిగిరి ఆనందం, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, రాయని శ్రీకాంత్, నల్ల నవీన్, తీగల బాలకృష్ణ, ఆనందా చారి, మోతుకూరి సంతోష్, వేముల హరీష్, భయగాని గణపతి, బొట్ల రవీ, బొంకూరి సమ్మయ్య, కార్త్రేవుల రాజయ్య, ఆర్.ఎం.పి భాస్కర్, నేరెళ్ల ఓదెలు, మండల రాజేష్, బండి తిరుపతి, గుర్రం విజేందర్, కోడెల రాజమల్లు, గుర్రం సుశ్రిత్, రాజు నాయక్, మల్లయ్య, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హరిహర ప్రీమియర్ లీగ్ సీజన్-4 విజేతగా హరిహర లయన్స్

## రన్నరప్‌గా హరిహర జైంట్స్.. విజేతలకు ట్రోఫీ అందజేసిన శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ఎండీ యాదవ రెడ్డి




**పీర్జాదిగూడ, యువ వెలుగు, అక్టోబర్ 13 :** తూర్పు హైదరాబాద్‌లో ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణ సంస్థ శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరిహర ప్రీమియర్ లీగ్ (హెచ్‌హెచ్‌పీఎల్) సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో హరిహర లయన్స్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలవగా, హరిహర జైంట్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. హరిహర గ్రూప్‌కు చెందిన వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతోపాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన నాలుగో సీజన్ పోటీలు క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి. లీగ్ దశలో ప్రతిభ కనబరిచిన జట్లు ఫైనల్‌కు చేరుకోగా, ఆదివారం జరిగిన తుది పోరులో హరిహర లయన్స్, హరిహర జైంట్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో హరిహర లయన్స్ విజయం సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పిడి యాదవ రెడ్డి విజేత హరిహర లయన్స్ జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేసి క్రీడాకారులను అభినందించారు. రన్నరప్‌గా నిలిచిన హరిహర జైంట్స్ జట్టును సైతం అభినందించారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ, హరిహర గ్రూప్ పరిధిలోని వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహపూర్వక పరిచయాలను పెంపొందించడం, పరస్పర సంబంధాలను బలోపేతం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే హరిహర ప్రీమియర్ లీగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, సమష్టి భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నివాసితులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా భవిష్యత్తులో మరిన్ని క్రీడా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. హరిహర ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు హరి రెడ్డి, విజేత హరిహర లయన్స్ జట్టు కెప్టెన్ రాజశేఖర్ వర్మ, వైస్ కెప్టెన్ అమర్ సింహ, టోర్నమెంట్ నిర్వాహకులు సైదులు గౌడ్, వినయ్ రెడ్డి, రమేష్ రెడ్డి, చేతన్, ప్రవీణ్ రెడ్డి, నర్సయ్య, సురేందర్‌తోపాటు వివిధ జట్ల క్రీడాకారులు, హరిహర గ్రూప్ గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరిహర ప్రీమియర్ లీగ్ కేవలం క్రికెట్ పోటీలకే పరిమితం కాకుండా, వివిధ కమ్యూనిటీల కుటుంబాల మధ్య స్నేహసంబంధాలు, ఐక్యత, సమష్టి భావనను పెంపొందించే వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగాల మేళ

## నిరుద్యోగుల ఉపాధి నా లక్ష్యం

## పేదరిక నిర్మూలన నా ధ్యేయం ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి



**ఆమనగల్, యువ వెలుగు, అక్టోబర్ 13 :** ఆమనగల్ మండలంలో ఐక్యత ఫౌండేషన్ ఆఫీసులో జాబు మేళ కార్యక్రమం. విజయవంతం. ఆమనగల్ మండలంలో 13 గ్రామ పంచాయతీల సమాచారం ఆర్గనైజర్ రచ్చ రాములు ఆధ్వర్యంలో ఉపాధి కల్పన. తపనతో మండలంలో జాబు మేళనిర్వహించడం జరిగినది కార్యక్రమానికి గ్రామ గ్రామాన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు మహేశ్వరంలో ఉన్నటువంటి ప్రైవేట్ కంపెనీలో 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు .నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ సంకల్పంలో 600 జాబ్ మేలకు హాజరు కావడం జరిగినది. 3వందల అరవై మందిని షర్ట్ పే చేయడం జరిగినది.మీద నిర్వహించడం జరిగినది కార్యక్రమానికి మాడుగుల మండల ఆర్గనైజర్లు ఉద్యోగమేలలో పాల్గొనడం జరిగినది అర్హులైన వారిని ఆయా కంపెనీ ప్రతీ. నిక్ . శివష్రతీ మహేష్. ఫ్లోరింగ్ పార్ట్నర్ ఎల్ ఎన్ శివ. కంపెనీల ప్రతినిధులు జగన్ లక్ష్మణ్ పావని శిరీష నితీష్. ఆర్గనైజర్లు రచ్చ రాములు. చంద్రశేఖర్. కొండలు యాదవవాళ్లు ఎంపిక చేసుకుని వారికి జీతభత్యాలు ఇవ్వడం జరిగింది సెలెక్షన్ వారికి కంపెనీ రవాణా బచ్చాలు కంపెనీ చూసుకోవడం జరుగు తుందని మధ్యాహ్న భోజనం వారి కంపెనీ వాళ్ళు సమకూర్చడం జరుగుతుందని ఐక్యత చైర్మన్. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ఇచ్చిన యువతీ యువకులకు భోజనంఏర్పాటు చేయడం జరిగినద జాబ్ మేళా విజయవంతమైనది.



# కరెంట్ కోతలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గుర్రంపోడులో భారీ ధర్నా

**నాగార్జునసాగర్, యువ వెలుగు, అక్టోబర్ 13 :** రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గుర్రంపోడు మండలంలోని రహదారిపై ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 24 గంటల ఉచిత కరెంటు ఇస్తారని రైతులకు హామీ ఇచ్చి నేడు కనీసం 5 నుండి 6 గంటలు కూడ సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పి రైతులకు మొండి చెయ్యి చూపిందని విమర్శించారు. కరెంటు లేక రైతులు వేసిన పంటలన్నీ ఎండిపోయి పంట పొలాల భూములు పగుళ్లు తేలుతున్నాయనీ మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కడారి అంజయ్య యాదవ్, పాశం గోపాల్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు,ముఖ్య నాయకులు,ఉద్యమకారులు రైతులు, యువకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**